రోడ్ల విస్తరణ...నూతన శోభ !

- చురుగ్గా సాగుతున్న రూ. 16 కోట్లతో చేపట్టిన రహదారుల పనులు
- మారనున్న ప్యాపిలి రూపురేఖలు

ప్యాపిలి: గత ప్రభుత్వ హయాంలో పల్లెలే కాదు మండల కేంద్రాలు సైతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేవి. ప్రత్యేకించి గ్రామాల్లో రహదారి సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఇందుకు మండల కేంద్రం ప్యాపిలి మినాహాయింపేమీ కాదు. మండల కేంద్రం అని చెప్పుకోవడానికే అన్నట్లుగా ఉంది ప్యాపిలి పరిస్థితి. మౌలిక వసతుల విషయంలో ప్యాపిలి గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేక పోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ఎక్కడికక్కడ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతుంది. మారుమూల గ్రామాల్లో సైతం అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రహదారి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణం వెలుపల ఉన్న 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పట్టణం మీదుగా 5 కిలోమీటర్ల మేర నాలుగులేన్ల రహదారిని మంజూరు చేయించారు. ఎండీఆర్ ప్లాన్ కింద రూ. 16 కోట్లతో కొన్ని నెలల క్రితం పట్టణంలో రహదారి విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం రహదారి పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో నెలలో పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు మరింత వేగవంతం చేశారు. రోడ్డుకు ఇరువైపులా డీఎంఎఫ్ నిధులు రూ. 1.4 కోట్లతో డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేస్తున్నారు.


రహదారి విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం


మధ్యలో డివైడర్‌తో ఏర్పాటు చేసిన రోడ్డు

ఆక్రమణలు తొలగింపు

మండల కేంద్రం ప్యాపిలిలో రోడ్లు ఇరుకుగా మారాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. పాత రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా బంకులు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. మరి కొందరు అక్రమంగా ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు, దుకాణ సముదాయాలు నిర్మించుకున్నారు. అయితే రహదారి విస్తరణ పనులు ప్రారంభంగా కాగానే ఎవరికి వారు బంకులు తొలగించుకున్నారు. అలాగే అక్రమంగా నిర్మాణాలు చేసుకున్నవారు సైతం వారి కట్టడాలను పూర్తిగా కూల్చివేశారు. దీంతో రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

డివైడర్లతో కొత్త శోభ

రోడ్డుకు ఇరువైపుల ఆక్రమణలతో ఇరుకుగా ఉన్న రహదారి ప్రస్తుతం విస్తరణ పనులు జరుగుతుండటంతో విశాలంగా మారింది. మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి వన్‌వే ఏర్పాటు చేస్తుండటంతో ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట పడనుంది. డివైడర్ల మధ్యలో మొక్కలు, బటర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేసిన తర్వాత పట్టణానికి కొత్త శోభ సంతరించుకుంటుంది అనడంలో సందేహం లేదు. గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్యాపిలిలో ప్రస్తుతం శాశ్వత అభివృద్ధి పనులు జరుగుతుండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి చొరవతోనే రహదారి విస్తరణ



స్థానికంగా ట్రాఫిక్ ఇబ్బంది తీవ్రంగా ఉండటంతో మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన మంత్రి రహదారి విస్తరణకు అవసరమైన నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రం అయినప్పటికీ మారుమూల గ్రామాన్ని తలపించేలా ఉన్న ప్యాపిలి ప్రస్తుతం మన్సిపాలిటి కేంద్రానికి దీటుగా అభివృద్ధి చెందుతోంది. పట్టణ అభివృద్ధికి పాటుపడుతున్న ఆర్థికశాఖ మంత్రికి రుణపడి ఉంటాము.

– బోరెడ్డి శ్రీరామిరెడ్డి, జెడ్పీటీసీ, ప్యాపిలి

నెల రోజుల్లో పనులు పూర్తి



రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం 50 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలి ఉన్న 50 శాతం పనులు మే ఆఖరుకు పూర్తి చేస్తాం. రోడ్ల విస్తరణంలో ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు కొత్త శోభ చేకూరుతుంది.

–ప్రసాద్ రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ

క్లుప్తంగా

1 నుంచి 'గడపగడపకు మన ప్రభుత్వం'

అవుకు: మండల పరిధిలోని కొండమీద పల్లెల్లో మే 1, 2 తేదీల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 1వ తేదీన సాయంత్రం నుంచి మర్రికుంటతండా, ఇస్రానాయక్ తండా, మన్నేనాయక్ తండాల్లో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పర్యటిస్తారన్నారు. అదేవిధంగా 2వ తేదీన కునుకుంట్ల గ్రామంలో కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులతో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

టార్పాలిన్ల పంపిణీ


టార్పాలిన్లు అందజేస్తున్న సర్పంచ్ సరోజమ్మ

ప్యాపిలి: మండల పరిధిలోని చంద్రపల్లిలో సర్పంచ్ సరోజమ్మ చేతుల మీదుగా శుక్రవారం రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీతో రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తుందని సర్పంచ్ తెలిపారు. టార్పాలిన్లు అవసరమైన వారు స్థానిక ఆర్బీకేల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ వినీత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ విభాగంలో నిర్వహించే సమ్మర్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం లలితా శ్యామల తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. మే 1వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 8.45 గంటల వరకు ఫిజికల్, గేమ్స్‌పై శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణ అనంతరం జిల్లాస్థాయి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు.

శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


చౌడేశ్వరిదేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ఈఓ రామాజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులుగావించి సంప్రదాయబద్ధంగా సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ల పంపిణీ


వీల్‌చైర్ అందజేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

బేతంచెర్ల: మండలంలోని ఆర్ ఎస్ రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఎం.పెండేకల్లు, రహిమానుపురం గ్రామాలకు చెందిన ఫ్లోరైడ్ బాధిత దివ్యాంగులు ఎర్రమల పొట్లన్న, సోమేశ్వరమ్మకు ఒక్కొక్కరికి రూ. 5వేల విలువచేసే వీల్ చైర్లను రెడ్ క్రాస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసురేంద్ర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, వైద్యురాలు శాంతి, ఉమ్మడి జిల్లా ఫ్లోరైడ్ నియంత్రణ అధికారి సుధాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగప్రసాద్, రంగస్వామి పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

డోన్: స్థానిక పాత బస్టాండ్‌లో వెలసిన శ్రీ కనకదుర్గ దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలోభక్తులు అమ్మవారికి పూలతో ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

4న మండల మీట్

బేతంచెర్ల: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మే 4వ తేదీన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశానికి తప్పక హాజరు కావాలన్నారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు తమ అభివృద్ధి నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు. .

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు ఆర్ఎస్ రంగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు మినహా మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీ మధు సూధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని పరిశ్రమల యజమాన్యాలు, గ్రామీణ ప్రాంత రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. కౌన్సిలర్‌లు సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

పరామర్శ

బనగానపల్లె: వెలుగు కార్యాలయంలో ఏపీఓగా పనిచేస్తున్న తిరుపాల్‌రెడ్డి ఈ నెల 21న రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నంద్యాల నివాసం ఉంటున్న ఏపీఓ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద వివరాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే ధైర్యంగా ఉండాలని ఏపీఓకు సూచించారు.

ఆర్టీసీ షాపులకు టెండర్లు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఏర్పాటు చేసిన షాపుల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎం తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ స్థలాల్లో ఉన్న 15 షాపులకు ఔత్సాహిత పారిశ్రామిక వేత్తల నుంచి టెండర్లకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. టెండర్ దరఖాస్తులను మే 3వతేదీలోపు నంద్యాల ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి


ప్రశ్నావలిని నింపుతున్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన తదితర 32 సంక్షేమ పథకాలను వర్తింపజేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్లలోని వివిధ కాలనీల్లో నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ వలంటీర్లతో కలిసి ఇంటింటిని సందర్శించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేశారు. ప్రభుత్వ పాలన తీరుపై ఆరా తీశారు. అనంతరం కుటుంబ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల రామకృష్ణారెడ్డి, గజ్జెలరెడ్డి, దశరథరామిరెడ్డి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

డోన్ టౌన్ : ఆదోని పట్టణంలో నాయీబ్రాహ్మణ వృత్తిని ఇతరులు సెలూన్ షాపు ఏర్పాటు చేసి తమకు అన్యాయం చేస్తున్నారని, న్యాయం చేయాలని ఆ సంఘం డోన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దయ్య, తిరుపాల్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సోమ శేఖర్, సోమన్న, గోపాల్, రామకృష్ణ, రంగస్వామి,చెన్నయ్య, గిరి తదితరులు ఉన్నారు.

మే డేను జయప్రదం చేయండి

డోన్ టౌన్: ప్రపంచ కార్మిక దినోత్సవం మే1న నిర్వహించే మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరాం పిలుపునిచ్చారు. మేడే ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నక్కిశ్రీకాంత్, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగమద్దయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు చిన్నరహిమాన్, నాగన్న, శివలింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

డోన్ టౌన్: మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. స్థానిక నక్కి రామన్న భవనలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానీ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని, పేదలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రంగనాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1500 ఎకరాల్లో పంట నష్టం

బనగానపల్లె: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలో వెయ్యి ఎకరాల్లో వరి పంట, 500 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. గ్రామాల వారీగా పర్యటించి పంట నష్టాన్ని అంచనవేశామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. పెనుగాలులకు మామిడి రైతులు నష్టపోయారని ఉద్యానవనశాఖ అధికారి రఘువరన్ తెలిపారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో వర్షం కురిసింది. అకాల వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉండగా వరి నేలవాలి నష్టం వాటిల్లింది. అలాగే కల్లాల్లోని మిరప దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకుని కాపాడుకున్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులు

బనగానపల్లెరూరల్: ఒలంపియాడ్ పరీక్షల్లో పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరచి బంగారు పతాకం సాధించిన్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి శుక్రవారం తెలిపారు. 9వ తరగతి హరిణి, మల్లేశ్వరి, హిమాజప్రియా, హాజరబీ, లక్ష్మీప్రసన్న, శ్రావణి, తేజేశ్వరి, 8వ తరగతి మేఘశ్రీ, 7వ తరగతి సాయి చైతన్య, 6వ తరగతి బాలాజీనాయక్, నాగసంపత్, శివనందు వివధ సబ్జక్టుల్లో బంగారు పతకం సాధించిన్నట్లు తెలిపారు. ప్రతిభకనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రం, గోల్డ్ మెడల్‌ను ప్రిన్సిపాల్ రామలక్ష్మీ చేతుల మీదుగా అందజేసి విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీలకు గాయాలు


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నాయినపల్లె సమీపాన కదిరికుంట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మందికిపైగా మహిళా కూలీలు గాయపడ్డారు. నాయినపల్లెకు చెందిన మహిళలు రోజు మాదిరిగానే ఆటోలో అవుకు మండలం సుంకేసులకు మిరప కోత పనులకు వెళ్లారు. మధ్యాహ్నాం పనులు పూర్తయ్యాక స్వగ్రామానికి వస్తున్న తరుణంలో గ్రామానికి అతి సమీపంలోని కదిరికుంట వద్దకు ఆటో టైర్ పగిలి రోడ్డు పక్కనున్న సిమెంట్ దిమ్మెను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన తులశమ్మ, కుళ్లాయమ్మ, మహేశ్వరి, శివలక్షుమ్మ, లక్షుమ్మను 108 అంబులెన్స్‌లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో కొలిమిగుండ్లలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆటో సిమెంట్ దిమ్మెను ఢీకొనకపోయింటే రోడ్డు పక్కన బోల్తా పడి ప్రమాద తీవ్రత పెరిగి ఉండేదని ప్రజలు అన్నారు.

పెద్ద వెంతుర్లలో బోరు ఏర్పాటు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్ల రైతు భరోసా కేంద్రం సమీపంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో బోరు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పద్మాంజలిదేవి శుక్రవారం తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా అదనంగా బోరు వేయడంతో పుష్కలంగా నీళ్లు పడ్డాయన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని, బోరు నుంచి త్వరలోనే పైపులైన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆమె చెప్పారు.

వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్చిన స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి వద్ద గుడిసెలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఆరోగ్యం క్షీణించింది. అచేతనంగా ఉండటాన్ని గమనించిన స్ఫూర్తి సేవా సమితి సభ్యులు వైఎస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో శుక్రవారం చేర్పించారు. వృద్ధురాలిని చేరదీసిన ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

4న లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

డోన్: మండలంలోని యాపదిన్నె గ్రామంలో వెలసిన ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రమైన లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం మే 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ నేపథ్యంలో 3వ తేదీ ఉదయం నుంచి 2రోజల పాటు గ్రామంలో రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలైన జట్లకు రూ. 50 వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు చొప్పున బహుమతులు అందజేస్తామన్నారు. మే 4వ తేదీన నరసింహస్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముచ్చట్ల వాగులో డోన్ రహదారిలో రెండు ట్రిపర్లు ప్రమాదవశాత్తు ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో ట్రిప్పర్‌లో ఉన్న సోనులాల్‌కు గాయాలు అయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య శుక్రవారం తెలిపారు.

మాట్కా నిర్వాహకుల అరెస్టు

బేతంచెర్ల: స్థానిక కొత్తబస్టాండు పరిసర ప్రాంతంలో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శనివారం తెలిపారు. పట్టణానికి చెందిన హుసేన్ బాషా, మీనిగ మధు మట్కా రాస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకుని చీటీలతోపాటు, రూ. 4వేలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

30 నుంచి ఆరాధన ఉత్సవాలు

బనగానపల్లె: పట్టణ సమీపంలోని వీరప్పయ్య స్వామి నేలమఠంలో ఈ నెల 30 నుంచి మే 2 వరకు 330వ వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామక్రిష్ణ తెలిపారు. 30న నాదస్వరం, సుప్రభాతం, అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదేవిధంగా మే 1న సూక్త పూజ, కుంకుమార్చన, రాత్రి 7 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, 2న మహానివేదన తదితర కార్యక్రమాలు ఉంటాయని ఏఓ తెలిపారు.

మజ్జిగ పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు.వేసవి నేపథ్యంలోప్రజల సౌకర్యార్థం మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీసింగ్ తెలిపారు.

డోన్ టౌన్ : స్థానిక పాతబస్టాండ్‌లో శుక్రవారం ప్రజలకు స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన రాజా ప్రదీప్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా చేసిన ఆర్థిక సాయంతో మజ్జిగ పంపిణీ చేశామని స్ఫూర్తి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తెలిపారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం


మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : స్థానిక కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. పట్టణాభివృద్ధికి సంబంధించిన 22 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినందుకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు. బేతంచెర్ల రోడ్డులోని కొండపేట బీసీ హాస్టల్ ఎదురుగా బాలికల మదర్సా కోసం 3 సెంట్ల స్థలం కేటాయించడం జరిగిందన్నారు. అలాగే పట్టణానికి దక్షిణ భాగాన కొండపైన ఐలవ్‌యు డోన్, నేషనల్ ఫ్లాగ్ ఏర్పాటుకు 5 సెంట్ల స్థలాన్ని కేటాయించాల్సిందిగా అటవీశాఖ అధికారులను కోరుతూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందని చైర్మన్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్లు కొట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, ఏఈ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ వీరేంద్ర, సిబ్బంది తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ దానం

బనగానపల్లెరూరల్: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో శుక్రవారం డోన్ డివిజన్‌లో విధులు నిర్వహించే ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు కొత్తగా వచ్చిన లోకోస్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా ప్రొగ్రామ్ మేనేజర్ దానం మాట్లాడుతూ పొదుపు సంఘాల అమలులో దేశం మొత్తం ఒకే విధానం ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా లోకోస్ యాప్ తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్‌లో రాష్ట్రంలోని అన్ని పొదుపు సంఘాల పర్సనల్ డేటాతో పాటు తీసుకున్న రుణాలు, చెల్లింపులు తదితర వివరాలను వెలుగు సిబ్బంది నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో పొదుపు సంఘాల్లో లేకుండా ఉన్న వారిని, చేరే విధంగా చైతన్య పరచాలని, నిలిచిపోయిన డ్వాక్రా సంఘాల వివరాలను సేకరించి మళ్లీ పనిచేసేలా ప్రోత్సహించాలని వెలుగు సిబ్బందికి సూచించారు. అనంతరం ట్రైనర్స్ శ్రీనివాసులు, శేఖర్, నరసయ్య ఇమాం లోకోస్ యాప్ ఏ విధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి, వివరాలను ఏ విధంగా నమోదు చేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం


సీఐ సుబ్బరాయుడును సన్మానిస్తునించిన దృశ్యం

బనగానపల్లెరూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో బనగానపల్లె సీఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సుబ్బరాయుడిని ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ పోలీస్ విధులు నిత్యం ఒత్తిడితో కూడినదిగా ఉంటుందన్నారు. బదిలీ పై వెళ్లిన సీఐ సుబ్బరాయుడు బనగానపల్లె నియోజకవర్గంలో గత ఏడు సంవత్సరాలకు పైగ ఎస్ఐ, సీఐగా విధులు నిర్వహించి, నియోజకవర్గం పరిధిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు కాపాడడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని గుర్తు చేశారు. సీఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు స్థానిక ప్రజల సహకారంతోనే తాను ఈ ప్రాంతంలో ఎస్ఐ, సీఐగా విధులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, కోవెలకుంట్ల సీఐ నారాయణరెడ్డి, బేతంచర్ల సీఐ ప్రియతంరెడ్డి, ప్యాపిలి సీఐ శ్రీరాములు, అవుకు, నందివర్గం, బనగానపల్లె బేతంచర్ల ఎస్ఐలు జగదీశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, నవీన్‌బాబు, వీరాంజనే యులు, శంకర్‌నాయక్ ఎమ్మెల్యే కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, ఉమ్మడి జెడ్పీటీసీ సంఘం అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, న్యాయవాదులు అబ్దుల్‌ఖైర్, మాధవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అత్తార్‌జాహెడ్, అబ్దుల్‌ఫైజ్, మాపీరా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

సంజామల(కోవెలకుంట్ల): నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద మంజూరైన పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సంజామల పంచాయతీ కార్యాలయంలో వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలంతోపాటు పక్కాగృహాలు కేటాయించిందన్నారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు, రాయితీపై 504 కిలోల ఇనుప కడ్డీలు, 120 బస్తాల సిమెంట్, ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుని సొంతింటి కల సాకారం చేసుకునేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, వీఆర్‌ఓలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.